కథ



# నొప్పింపక...

చీమలమర్రి శ్రీనివాసమూర్తి

రెండు మూడు నెలల నుంచి ప్రశాంతంగా ఉన్న నా [illegible]లోకి దుష్ట గ్రహమేదో మళ్ళీ ప్రవేశించింది.

"రేపు కాజీపేట సిద్ధార్థనగర్‌లో అమ్మాయిని చూడటానికి వెళ్ళాలి ఉదయం పదిన్నరకు. రేపు ఒక్కపూట ఆఫీసుకు సెలవు పెట్టు" అమ్మ అల్టిమేటం జారీ చేసింది.

ఆమె నోటినుండి ఆర్డరు వచ్చిందంటే ఆరు నూరైనా నూరు ఆరైనా అమలు జరిగి తీరవలసిందే. తిరుగుండటానికి వీలు లేదు. కట్టుకున్న భర్తయినా సరే, కడుపున పుట్టిన కొడుకులైనా సరే మినహాయింపు ఉండదు. చేయగలిగిందేమీ లేక ఆ మరురోజు స్నేహితుని ద్వారా సెలవు చీటీ ఆఫీసుకు పంపించి, బలి పశువులా ఉండిపోయాను.

మరురోజు ఉదయం లేచిన దగ్గర్నుంచి హడావుడి మొదలయింది. బ్యాంకు లాకర్లలో ఉన్న నగలకు ముందురోజే విముక్తి కలిగినట్టుంది. ఆడువారి గళ సీమలలంకరించబడిపోయాయి. అప్పుడెప్పుడో పెళ్ళిళ్లకు నామకార్థం కొన్న చీరెలకు మోక్షం సంప్రాప్తం అయింది. పట్టు చీరెల ఫెళఫెళలు, గాజుల గళగలలూ, నగల తళతళలూ మొఖాల మిలమిలలూ చూస్తూంటే ఏకంగా పెళ్ళి కళే నేరుగా ఇంట్లోకి నడిచి వచ్చినట్టుంది. అక్కయ్య హడావుడి అమ్మకేకలు, నాన్న సణుగుడు బామ్మ అక్షింతలూ - షరామామూలే, కూరగాయల మార్కెట్టు నయం.

"వసుంధరను కారు పంపమన్నాను. పది గంటలకల్లా వచ్చేస్తుంది... అదేమిటి? మీరు ఇంకా ఆ బట్టలతోనే ఉన్నారు. అవతల టయిం అయిపోతూ ఉంటే.... నడవండి" నాన్నవైపు విసుగుతో చూసింది అమ్మ.

"పెళ్ళి చూపులు నాకు కాదు గదే !" మాట వరసకు అన్నాడే గానీ, నాన్న బట్టలు మార్చుకోక ఏం చేస్తాడు?

మింగాలేను కక్కాలేను చందాన ఉంది నా పరిస్థితి. చేసేది టెంపరరీ ఉద్యోగం. యం.ఇ. పాసయినా నా అర్హతలకు తగిన ఉద్యోగం రాలేదు: నా ప్రయత్నంలో నేనున్నాను. ఎందుకర్రా మీకింత తొందరా? అంటే వినేనాథుడు లేడు. నా బాధ నాన్నకు తెలిసినా, ఆయన కుక్కిన పేను. నసుగుతాడే తప్ప" నాకిప్పుడే వొద్దు మొర్రో అని అంటుంటే ఎందుకర్రా మీకు ఈ లేనిపోని లాయిలాస" అని ఒక్కమాట అనడు. అనలేడు. నేను ముకురిస్తే అమ్మ ఏడుపుకు లంకించుకుంటుంది.

చేయగలిగినదేమీ లేక గంగిరెద్దులా కారెక్కాను.

పెళ్ళి చూపుల తతంగం ముగించుకొని ఇంటికి రావటానికి రెండు మూడు గంటలు పట్టింది. మా వాళ్ళు బలవంతంగాక పోతే నాకేమీ ఇంట్రస్టు లేదు. ఏదో చూడాలి కాబట్టి చూశాను. అంతవరకే.

ఇంటికి రాంగానేపోస్ట్‌మార్టం మొదలైంది.

"పిల్లతెల్లటి తెలుపు గాకపోయినా మొఖంలో కళవుంది" నాన్న మాట. అది మిగతా వాళ్ళు అనే మాటలకు కేవలం నాంది మాత్రమే.

"నుదురు కాస్త ఎక్కువగా ఉన్నట్లుంది. మీరు చూశారో లేదో" అక్కయ్య ఉవాచ. "అద్దంలో నీ ముఖం ఎన్నడైయినా చూసుకున్నావా సరిగ్గా?" అందామనుకున్నాను. అనలేదు. ఏడ్చి చస్తుంది. సాటి ఆడపిల్ల మీద అనవసరపు కామెంట్సు ఎందుకు చేస్తారో?

"ఇల్లు మామూలుగానే ఉంది గదూ మమ్మీ? గదులు ఇరుకిరుకుగా ఉన్నాయి" చెల్లెలు గారి పరిశోధనా ఫలితం.


"నేను ఆ ఇంటికి కాపురం చేయటానికి పోవటం లేదు గదా చెల్లెలా"? అని అనలేదు నేను.

ఇంతకూ ఉన్నవాళ్ళేనా?" బామ్మగారి ఎంక్వయిరీ ఆమె ధ్యాస ఆమెది

"ఒక లక్ష దాకా ముట్టజెప్పొచ్చు" నాన్నగారి అంచనా. తన కోసం గాదు. మిగతా వారి కోసం-ఆయన మాటల్లో ధ్వని వ్యంగ్యం ఉంటాయి. అవి నా కొక్కడికే అర్థం అవుతాయి.

"ఇంజనీరింగ్ చదివిన వాడికి లక్ష ఏ మూలకురా? నా నాయనకు ఏం తక్కువనీ? అందమా? చదువా?"- బామ్మ భరోసా." ఇది గాకపోతే ఇంకోటవుతుంది" అమ్మ. ఆశ్వాసన.

"ఇంతకూ ఆడ బడుచు లాంఛనాల విషయం ఆలోచించారా? అక్కయ్య ఆరా.



"ఏవయ్యా! ఆ డూప్‌ని మరీ అంత బాగా నటించెయ్యొద్దు అని చెప్పు" అన్నాడు నటుడు దర్శకునితో.

"ఏం సార్!" అర్థంగాక అడిగాడు దర్శకుడు.

"రోజులసలే బాగాలేవు. రేపొద్దున్న వాడే హీరోగా సినిమా వచ్చేసిందంటే ఇక నా సినిమాలు ఎవడు చూస్తాడయ్యా!" చికాకుగా అన్నాడు నటుడు.

- చీకటి మృత్యుంజయరావు

అసలు అమ్మాయి నచ్చింది లేదా లేదా అని ఒక్కరూ నన్ను అడిగిన పాపాన బోలేదు. ఎవరికి వారు మాట్లాడుకుంటున్నారు.

విసుగొచ్చి వీధిలోకి పరుగెత్తాను.

* *** *** *

రెండు మూడు రోజుల తర్వాత అన్నయ్యా వొదినె పిల్లలిద్దరూ వచ్చారు బరోడా నుంచి. బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఓ పది రోజులుండి అందరిని చూసి పోదామని వచ్చాడు. మొదటి రోజున ఇల్లంత ఆనందమయమయింది. రెండో రోజు నుండి గతం అందరికి గుర్తొచ్చిందిలా ఉంది, అన్యాపదేశంగా పుల్ల విరుపులూ, ధ్వనులూ, నుడికారాలూ, అలంకారాలూ మొదలైనాయి.

వొదినెకు, అన్నయ్యకు, నాన్నకు వాళ్ల నైజం తెలును. వాళ్ల మాటలు వింటూ చిరునవ్వులు చిందిస్తూ అవసరమయితే అందంగా సమాధానాలు చెపుతూ పరిస్థితిని-చాలా వరకు తమకు అనుకూలంగా మలచుకోవటం ఆ దంపతులకు తెలును.

సీరియస్‌గా వచ్చే మాటలను కూడా చాలా క్యాజువల్‌గా తీసుకుంటూ, నవ్వుతూ నవ్విస్తూ సర్దుకుపోవడంలో దిట్టలు. భార్యను సైడ్ చేసినట్లే ఉంటాడు కాని ఆమె మీద ఈగ వాలనీయడు. ఆయన ఎప్పుడైనా వొదినెను ఏదైనా అన్నాడంటే అది ఇతరుల సంతృప్తి కోసం ఆడే నాటకం మాత్రమే. వొదినెకు కూడా ఆ సంగతి తెలును. అందుకనే దానికి అనుగుణ్యంగా మసలుకుంటుంది.

మానసిక శాస్త్రవేత్తల నగటు అంచనాల ప్రకారం ప్రపంచంలో విజయవంతమయ్యే వివాహాలు కేవలం పది శాతమే. మిగతావన్నీ కేవలం పిల్లలకోసమో, సమాజం కోసమో, ఏవైనా ఇతర కారణాల చేతనే కొనసాగింబడేవే, ఒక వివాహం విజయవంతం కావాలంటే, ఒకరి నొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలి. స్నేహితుల్లా మెలగాలి. ఇందులో ఎక్కువ తక్కువల ప్రసక్తే లేదు. అన్నయ్యా వొదినెలను చూస్తుంటే భార్య భర్తలు అనే దాని కంటే ఆప్తమిత్రులు అంటే బాగుంటుందేమో ననిపిస్తుంది.

అన్నయ్యా నేను కలిసి బజారు కెళ్ళినప్పుడు నా సోదంతా వెళ్లగక్కాను. ఇంట్లో వాళ్ల వ్యవహారాన్ని కూడా నాకున్న కసికొద్దీ ఏకి వదిలి పెట్టాను. వీళ్లందరిని వొదిలి ఎక్కడికైనా దూరంగా పారిపోవాలనే కోర్కె కూడా వెలిబుచ్చాను. నేను చెప్పినదంతా ఓపిగ్గా విన్నాడు. పల్లెత్తు మాట మాట్లాడలేదు. కేవలం ఒక శ్రోతలానే ఉండిపోయాడు. నా మనసులో బరువంత దించుకున్నాక "ఇక పోదామా" అని మాత్రం అన్నాడు. ఏదైనా సలహా గాని, సాంత్వనగాని అందిస్తాడనుకున్న నాకు నిరాశే ఎదురైంది.

* *** *** *** *

నాలుగో రోజే మళ్లా తతంగం మొదలయింది. ఈ సారి ఈ సంబంధం వదినెకు తెలిసిన వారి తాలూకుట. అన్నయ్యే అద్దెకారు ఏర్పాటు చేశాడు. గుంటూరు రింగ్‌రోడ్డులో అమ్మాయి వాళ్ల ఇల్లు. వరంగల్ నుండి ఏకంగా కారులోనే పోతే మంచిదని అన్నయ్య అభిప్రాయం.

ఇంటి ముందు కారు ఆపి పోలోమంటూదిగాము. అది ఇల్లు అనే కంటే ఇంద్రభవనం అంటే సరిగ్గా ఉంటుందనుకున్నాను. దాదాపు వెయ్యి చదరపు గజాల జాగాలో విశాలంగా కట్టించబడి ఉంది. ముందు చాలా ఖాళీ స్థలం, నిండా రకరకాల పూలమొక్కలు, క్రోటన్స్ ఆ భవంతికి చక్కని శోభను అందిస్తున్నాయి. కారు దిగి లోపలికి అడుగుపెడుతుంటే ఒక మాయా ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లయింది.

అందరూ కూర్చున్న తర్వాత నా చదువు ఉద్యోగ వివరాలు అడిగారు. చాలా డాబు దర్పంగా ఉన్నారు ఆ అమ్మా

అందరూ కూర్చున్న తర్వాత నా చదువు, ఉద్యోగ వివరాలు అడిగారు. చాలా హుందాగా దర్పంగా ఉన్నారు. ఆ అమ్మాయి తల్లి దండ్రులు మర్యాదలు బాగానే చేశారు. రకరకాల స్వీట్లు తెప్పించారు. ఇల్లంతా చూపించారు. మా వాళ్ళవాలకం చూస్తే అక్కడే ఉండిపోతే బాగుంటుందనేలా ఉంది. అన్నయ్య చాలా మితంగా మాట్లాడాడు. ఎప్పుడో పాతపరిచయం కాబోలు వొదినె మాత్రం వాళ్ళతో కలుపుగోలుగా మాట్లాడింది. అమ్మాయి చక్కగా ఉంది. అనవసరపు ఆడంబరాలకు పోకుండా చాలా సింపుల్‌గా డ్రస్ చేసుకుంది. అసలు పెళ్ళి కూతురిలా తయారవ లేదంటేనే బాగుంటుంది తనకు పెళ్ళి చూపులు జరుగుతున్నాయనే ధ్యాసైనా ఉన్నట్లు లేదు. రెండు మూడు సార్లు నావేపు చూసింది. నేనే తలత్రిప్పుకోవాల్సివచ్చింది. చాలా చురుకు కళ్ళు. పైకి చెప్పలేదుగానీ అమ్మాయి నచ్చినట్లు అందరూ ఒప్పుకున్నారు. వాళ్ళ మొఖాలు చూస్తుంటేనే అర్థమయిపోతోంది.

తతంగమంత పూర్తయిన తర్వాత సెలవు తీసుకుని వరంగల్ వచ్చి పడ్డాము వెంబడే ఉత్తరం కూడా వ్రాశాము.

నాలుగో రోజుకే వాళ్ళయ దగ్గర నుంచి ఉత్తరం రానే వచ్చింది. "అమ్మాయికి అబ్బాయి నచ్చలేదని చదువున్నా అతను చేసే ఉద్యోగం కూడా చాలా చిన్నదనీ, తమకు తగిన అంతస్తులో లేదనీ" ఉత్తరం సారాంశం.

అమ్మ ఆగ్రహోగ్రురాలైంది. "ఎంత డబ్బుంటే మాత్రం అంత పొగరా?"అని మండిపడింది.

. "డబ్బుంటే ఎవడికి గొప్ప వాళ్ళుగొప్ప వాళయ్యకే ఉండనీ, మనం చేసుకోవాలనుకున్నది వాళ్ళ పిల్లనికాని వాళ్ళ డబ్బును కాదు గదా?"అంటూ అక్కను వెళ్ళబోసుకుంది అక్కయ్య పోయిన ఆడబడుచు లాంచనాలు [కనీసం పాతిక వేలయినా ఉండొచ్చుబ] మనసులో మెదిలాయే లేదో తెలీదు.

"అంత డబ్బున్న వాళ్ళను చేసుకుంటే మనం భరాయించుకోవద్దు. వాళ్ళు నేలమీద నడుస్తారా?" అంటూ

దీర్ఘాలు తీసింది బామ్మ. అందని ద్రాక్షపండు వ్యవహారంలా అన్నయ్య కలుగచేసుకుని సర్ది చెప్పాడు.

"పోనీ లేమ్మా! మనకు నచ్చిన సంబంధంమే మనం చూసుకుందాం. దేశం గొడ్డు పోలేదు గదా! అసలు వాడి అర్హతకు తగిన ఉద్యోగం ఇంకా రానందు వల్లే గదా ఈ చిక్కులన్నీ కొమ్ములు చూపి బేరాలాడటం ఎందుకు నాలుగు నెలలు ఆగితే మంచిదేమో ఆలోచించండి వాడి ఉద్యోగ విషయంలో నేను కూడా ఆలోచిస్తున్నాను" అన్నాడు. ఆడవాళ్ళందరికి ఆ మాటలు బాగానే పని చేశాయిలా ఉంది.

కేవలం క్వాలిఫికేషన్స్ కాక దానిని తగిన ఉద్యోగం ఉంటేనే పెళ్ళిళ్ళ మార్కెట్టులో విలువ ఎక్కువనే విషయం అందరికీ అర్థమయింది.

పోయేముందు నేనొక్కడినే, అన్నయ్యనూ వదినె పిల్లలనూ రైలెక్కించటానికి పోయాను స్టేషన్‌లో దగ్గరకు తీసుకుని అన్నాడు అన్నయ్య.

"రవీ! డబ్బు మనిషికి అవసరమే అందుకు సందేహంలేదు. కాని దానితో కొనుక్కోగలిగింది సుఖమొక్కటే. శాంతి కాదు. అమ్మా బామ్మా వాళ్ళ తరం వేరు. వారి ఆలోచనా పరిధి చాలా తక్కువ. ఇప్పుడు వారిని మారమనటం మన మూర్ఖత్వం. అలాగనీ వాళ్ళు చెప్పినట్లల్లా వినమనీ నా ఉద్దేశం కాదు. చాలా విషయాలు వాళ్ళకు తెలియవు. తెలియచెప్పాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఎందుకంటే మారుతున్న సమాజానికి మనం ప్రతీకలం. వాళ్ళకంటే ఎక్కువ చదువుకున్న వాళ్ళం. ప్రపంచ పరిణామాల్ని ఆకళింపు చేసుకోగలిగిన వాళ్ళం. ప్రవాహం పారేటప్పుడు పాత నీటిని కూడా తీసుకుని పారుతుంది. కొత్తనీరు అంతేగానీ పాతనీటిని అసహ్యించుకోదు. కొన్ని విషయాలు వాళ్ళకు నోటిమాటలతో చెప్తే అర్థంకాదు. ఒప్పుకోటానికి అహం కూడా అడ్డం వస్తుంది. అందుకనే కొన్ని చర్యల ద్వారా వాళ్ళు అర్థం చేసుకునేలా చేయాలి. ఎవరి జీవిత సమస్యలకు వాళ్ళే వివేకంతో పరిష్కారం వెతుక్కోవాలి. అలా పరిష్కారం వెతుక్కోడంలో అందరినీ కూడగట్టుకునే ప్రయత్నం చేయాలి. వాళ్ళను పనికి రాని వాళ్ళుగా తృణీకరించటం భావ్యం కాదు, సంస్కారం కూడా కాదు. కొత్త భావనలకు బాటలకు పునాది పాతలోనే ఉంటుందనే విషయం మరువద్దు.

రెండో విషయం పెండ్లి అనేది కేవలం ఆర్థిక ప్రాతిపదిక మీద ఆధారపడకూడదు. అది కేవలం చివరి అంశం మాత్రమే మొదట మనిషి ముఖ్యం మానవ సంబంధం మీద ఆధారపడటం ఆర్థిక సంబంధాల మీద ఆధారపడటం కంటే ఉన్నతమైనది, చిరకాలం నిలిచేది..............."

నేను మంత్రముగ్ధునిలా కేవలం ఒక శ్రోతలా వింటూండి పోయాను. గీతోపదేశం పొందుతున్న అర్జునుడిలా.

రైలు కేకవేసింది. వదినా పిల్లలూ ముందే ఎక్కికూర్చున్నారు. చివరగా కదులుతున్న రైలుతోపాటు కదులుతూ "నీకు గుంటూరు అమ్మాయి సంబంధం నచ్చితే నాకు లెటరు వ్రాయి మిగతా విషయాలు నేను చూసుకుంటాను" అన్నాడు. వదినెందుకో మర్మగర్భంగా నవ్వుతోంది.

పోతూ ఉన్న రైలు కేసి, నిలువుగుడ్లేసి చూస్తూ ఉండిపోయాను. ●



"ఏవండీ! మీద పడకుండా సరిగ్గా నిలబడలేరా?" కోపంగా అడిగింది క్రిక్కిరిసి ఉన్న బస్సులో నిలబడ్డ అమ్మాయి వెనుక నిలబడ్డ అబ్బాయితో.

"కింద పడటానికి చోటులేదు కదండీ! అందుకే...." అమాయకంగా జవాబిచ్చాడు ఆ అబ్బాయి.

- చీకటి మృత్యుంజయరావు

---

# దక్షిణ గాలి మంచిదంటారు నిజమా?

భారతీయ సంస్కృతిలో నాటివాస్తు పండితులు రాబోయే తరాల వారు సుఖప్రదమైన ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడవడానికి ఎన్నో విషయాల్ని గ్రంథాల రూపంలో పొందుపరిచారు. తమతమ అనుభవ సారాన్ని రంగరించి సృష్టిలో దాగి ఉన్న రహస్యాల్ని సామెతల రూపంలో మనకు అందివ్వడం జరిగింది. ఏ వ్యక్తి అయినా జీవితానికి ఉపయోగపడే ప్రతి అంశాన్నీ తనకు తాను పరిశీలించి ఫలితాలను తెలుసుకోవడం ఎంతకాలమైనా సరిపోదు మన ముందుతరాల వారు అందించిన ఫలితాల్ని అనుభవిస్తూ మరింత కృషి సల్పడం ఉత్తమ మార్గం.

సామెతల రూపంలో ఉన్నా గ్రంథాల రూపంలో ఉన్నా ప్రతీ విషయం వెనక అర్థం,, పరమార్థంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతమైన జీవితం గడవడానికి మార్గం కన్పిస్తుంది. ఏ విషయం చూసినా భౌగోళిక సాంకేతిక శాస్త్రపరమైన వాస్తవాలు నిగూఢమైన అర్థం కనిపిస్తుంది.

ఇందులో భాగమే దక్షిణం గాలి ఆరోగ్యవంతమని ఇంటికి దక్షిణంవైపు పడక ఏర్పాటు చేసుకోవటం శ్రేష్ఠమైనటువంటిది అన్నారు. మనిషికి ప్రకృతి లేదా సృష్టి ప్రసాదించిన అపురూప వరాలలో ఒకటి గాలి. మనిషి జీవనానికి కారణమైన ప్రాణవాయువు కల్గి ఉన్న గాలి కలుషితమైనా కొరవడినా మనిషి మనుగడకే ముప్పువాటిల్లుతుందన్న విషయం మనందరకూ తెలిసిందే.

మనకున్న నాలుగు దిక్కులు, నాలుగు మూలలనుంచి వీచే గాలి ఎనిమిది రకాలైన విశిష్టగుణాలు కలిగి న్నాయి.

తూర్పు దిక్కు నుండి వచ్చేగాలి ఉప్పగా ఆహ్లాదంగా ఉంటుంది. కాని అధిక దాహాన్ని కల్గిస్తుంది. దానితోపాటు దగ్గు, పైత్యం,ఉబ్బసం,వాత రోగాల్ని ఎక్కువ చేస్తుంది. ఆగ్నేయమూలనుండి వీచేగాలి జిగటగా ఉండి వేడిగా ఉంటుంది. కళ్ళకు మంచిది.

దక్షిణ దిక్కునుండి వచ్చే గాలి శరీరంలోని మాలిన్యం పోవడానికి దోహదం చేస్తుంది. ఆరోగ్యహేతువు. నైరుతి మూల నుండి వీచే గాలి మేహం తాపాలతో పాటు సర్వరోగాలను నివారిస్తుంది. ప్రశాంతమైన వాతావరణం కల్పించి అక్కడ నివసించే వారిని ఆరోగ్యవంతంగా ఉంచడానికి దోహదం చేస్తుంది. మన పెద్దవారు దక్షిణం దిక్కు నైరుతి మూల పడక గది ఉండాలని దక్షిణంవైపే తలావు పెట్టి పడుకోవాలని చెప్పడం దీనిని ఉద్దేశించేనని గమనించాలి.

పశ్చిమ దిక్కునుంచి వీచే గాలి వెగటుగా ఉండటమే గాక ఎక్కువ వేడి కల్గిస్తుంది. వాయువ్య మూలనుంచి వీచే గాలి కారంగాను, చేదుగాను ఉంటుంది. తాపాన్ని దాహాన్ని పుట్టిస్తుంది. శరీరంలో ఉన్న నీటిని హరిస్తుంది. కఫం, పైత్యాన్ని కల్గిస్తుంది.

ఉత్తర దిక్కునుండి వచ్చే గాలి జిగటగా చల్లగా ఉంటుంది. శరీరంలోని దాతువులకు బలాన్ని కల్గిస్తుంది. శీతలపైత్యాన్ని కల్గిస్తుంది. ఈశాన్యమూలనుండి వచ్చే గాలి మధురంగా ఉంటుంది. దీని వలన కళ్ళకు హాని కల్గించే అవకాశం ఉంది. రక్తపైత్యానికి ఆస్కారం ఉంది.

ఏ విధంగా చూసినా దక్షిణంనుండి వచ్చే గాలి ఆరోగ్యానికి దోహదపడుతుంది అందువల్లే ఈ నాటికీ ఇళ్ళలోని పడకగదులు దక్షిణం దిక్కుగా ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

పి. కృష్ణాదిశేషు